

# తగిన శాస్తి

జయంతి కాశీ అన్నపూర్ణ

ప్రతి ఇంట్లో పండుగ - శుభదినం. మా ఇంట్లో తద్దినం. బతికుంతగా గుప్పెడు మెతుకులు ఆప్యాయంగా పెట్టలేని లక్ష్మి తెల్లగా తెల్లవారకుండానే తలవి మడి కట్టుకుని భక్తి శ్రద్ధలతో వంట చేస్తోంది. "అమ్మా ఉన్నావా? తిన్నావా" అని ఎప్పుడూ అడగని నేను అమ్మకు పనసకాయ కూర అంటే ఇష్టమని పనసకాయ కొడుతున్నాను. 'ఆ రోజు' ఇప్పటికీ జ్ఞాపకమే! మనసు గతాన్ని తవ్వుతోంది.

•• •• ••

"అమ్మా లక్ష్మీ! ఈ కాఫీ చల్లారిపోయింది. కొంచెం వేడి చేసి ఇయ్యమ్మా!"

"ఆ! మగాడ్ని మించిపోయాయి నాకరాలు. నాకు వేరే పని లేదా? అవతలే పనులతో సతమతమై ఛస్తున్నాను. ఒక్క చేతి మీద చేసుకుని చావాలి! వేడీ, వెచ్చా అంటూ ఇరవైనాలుగు గంటలూ మీ వెనకే తిరుగుతూ ఉండాలంటే కుదరదు. ఇష్టమయితే తాగండి. లేకపోతే మానండి!" అన్న కోడలు మాటలు జానకమ్మ మనసును కలవరపరిచాయి.

"నా కర్మకు వచ్చింది. నేను లేవలేకపోవటం వల్ల వచ్చింది. నేనూ ఒకానొకప్పుడు పదిమందికి ఈ చేత్తో పెట్టినదాన్నే. ఈ వయసు వచ్చిన తర్వాత బతికుండరాదు. కాని ఏమి చెయ్యటం కర్మ పరిపక్వం కావద్దూ? ఆయన అదృష్టవంతులు. ఈ బాదరబందీ లేకుండా స్వర్గానికి వెళ్లిపోయారు" అని కళ్ల నీళ్లు తుడుచుకుంది.

•• •• ••

"ఒరే రామూ! ఇలా రారా! కొంచెం కంట్లో మందు వేసి పెట్టు నాయనా!"

"ఒరే రామూ! ఆ మందుకేమీ తొందర లేదు కాని, నువ్వు పోయి చదువుకోరా! నా ప్రాణానికి ఈ మునల్ది ఒకటి. ఏ పనీ చేసుకోలేదు. నోరు మూసుకుని కూర్చోదు. పిల్లల్ని 'రా, పో!' అంటూ ప్రాణం తీస్తుంది. చదువు సంధ్యలు నాశనమైపోతున్నాయి. ఒక వయస్సు వచ్చాక నోరు మూసుకుని ఒకచోట పడి ఉండాలి. కర్మకొద్దీ ఇలాంటి వాళ్లు దొరుకుతారు. వాళ్లు చావరు. మమ్మల్ని బతకనీయరు!"

" నాయనమ్మా! మందు వేస్తాను!"

"వద్దు నాయనా! నీ చదువు పోతుందట నాకు వచ్చే కాలమా, పోయేకాలమా!"

"పరవాలేదు, నాయనమ్మా! ఏదీ కన్ను తెరు! అమ్మ అలాగే అంటుంది పట్టించుకోకు!"

"మా నాయనే! నా కడుపు చల్లగా! మీ తాత పేరు పెట్టినందుకు మంచి బుద్ధులు వచ్చాయిరా! మీ తమ్ముడు ఆ కిష్టిగాడు లేడూ, వాడివి అమ్మ వాళ్ల అమ్మమ్మ బుద్ధులే!"

"సరేలే! కాసేపు కళ్లు మూసుకుని పడుకో!"

•• •• ••

"అమ్మాయి లక్ష్మీ! కొంచెం కొత్త ఆవకాయ వెయ్యమ్మా నిన్న చేశావు కదా! నాకు చాలా ఇష్టం."

"ఆఁ! నాకూ ఇష్టమే, కష్టపడకుండా చేసి పెట్టేవాళ్లుంటే పండగపూటా ఎన్ని చేసి పెట్టినా, ఆవకాయ తక్కువయిందట. 'కొత్త ఆవకాయ'! పెట్టింది తినక గొంతెమ్మ కోరికలు. ఎంతకాలం బతికినా, ఎంత తిన్నా తృప్తి లేదు. ఇంకా బతికి ఎవరిని ఉద్ధరించాలనో! ఇదిగో ఆవకాయ! చెయ్యి అడ్డు తీయండి!"

** ** **

"ఒరే, అబ్బాయి వాసూ! మందులు అయిపోయినాయిరా! ఆఫీసు నుండి వచ్చేటప్పుడు తెచ్చిపెట్టవూ!"

"ఉండమ్మా! నేను అర్జెంటు పని మీద ఆఫీసుకు పోతున్నాను. అన్నీ నేనే ఏడవాలా? ఆ కిష్టిగాడి చేత తెప్పించుకోరాదూ! ఒక్క రోజు మందు లేకపోతే పరవాలేదులే!"

"ఆ! ఒక్క రోజు మందు లేకపోతే ఆయుష్షు తగ్గిపోదూ? నేను సుఖపడిపోనూ! బతుకు మీద ఎంత తీపి! ఇంకా బతికి మమ్మల్ని ఉద్ధరించాలనే కాబోలు!"

"నిండా నలభై ఏళ్లు లేని నేను ఎప్పుడు చద్దామా!' అని అనుకుంటూ ఉంటే."

"నీ కిప్పుడేం తెలుస్తుందమ్మా! ముందుంది ముసళ్ల పండగ! నీకు మాత్రం కొడుకులు లేరూ?"

"నాకేమీ మీలాగా బతకాలనీ, కొడుకుల్ని కోడళ్లను కాల్చుకు తినాలనీ లేదు. నేనేమీ ఎవర్నీ బాధపెట్టను. నేనేమీ వాళ్ల కొంపలకు పోయి, నెత్తి మీద కూర్చోను!"

"నేను మాత్రం ఇలా ఉందామనుకున్నానా అమ్మా! ఆ భగవంతునికి జాలి లేదు. ఏమి చెయ్యటం!"

"ఏమిటి చేసేది?! నోరు మూసుకుని కూర్చోండి. ఈ ఇంట్లో అడుగుపెట్టినప్పుడే అన్నీ వదులుకున్నాను. ఓ సరదా లేదు, పాడూ లేదు. ఇల్లు, పుస్తె ముడుపు అయిపోయింది. మీ జబ్బుకు ఎంత సొమ్మూ చాలటంలేదు!"

** ** **

"అమ్మా! గిన్నెలు!"

"ఒసే సీతాలూ! వచ్చావా! నాలుగు రోజులు ఎగ్గొట్టావు, ఛస్తున్నాను చాకిరీతో!"

"సీతాలూ! వచ్చావా అమ్మా! ఇలా రా! కొంచెం నా బట్టలు ఉతికిపెట్టవే!"

"ఉండండమ్మా వత్తన్నాను!"

"ఆ పని కేం కంగారు లేదు కానీ, గిన్నెలు తోమియ్యి! అసలే పని అవక చస్తున్నాను! మనిషి కనబడితే చాలు పని చెబుతుంది. అందుకే ఏ పనిమనిషీ పట్టున నాలుగు నెలలు కూడా నిలబడటంలేదు. నా ప్రాణానికి సుఖం లేదు. ఊపిరి పీల్చుకుందుకు కూడా లేదు! ఓ ఇరుగు లేదు, పొరుగు లేదు! ఎన్ని తిట్టినా సిగ్గూ లేదు, శరం లేదు. ఒకటే నస!"

** ** **

"లక్ష్మిగారూ! మారుతీ హాల్లో 'స్టూవర్టుపురం పోలీసు స్టేషను' సినిమా వచ్చింది, చూశారా! ఎంత బాగుందనుకున్నారూ!"

"నీకేమమ్మా మాధవీ! అత్త పోరా? ఆడపడుచుల పోరా! టింగురంగామంటూ ఇద్దరు. మే మిద్దరం మా కిద్దరు అన్నట్లు - బంటి, చంటి. వాళ్లిద్దరినీ చదువులకు అత్తగారింట్లో వదిలేస్తిరి. 'జాని జకారం మదన గోపాలం'లా దేనికైనా పెట్టి పుట్టాలమ్మా!" అంటూ లోకాభి రామాయణంలో పడ్డారు లక్ష్మి, మాధవి.

** ** **

"అమ్మా! ఇవిగో మందులు. ఇది ఉదయం, సాయంత్రం, ఇది రోజుకు మూడుసార్లు. ఇది రాత్రి పడుకోబోయేటప్పుడు"

"నాయనా వాసూ! ఇక మందులు చాల్లేరా! నీ జీతమంతా నా మందులకే సరిపోయేటట్లుంది!"

"దానికేంలే! మందు వేసుకో!"



"నాయనా వాసూ! లక్ష్మిని చూశావటరా? ఎలా అంటుందో!"

"దాని మాటల కేమిలే! కొత్త ఏమైనానా!"

"అది కాదురా ..."

"పోదూ! నువ్వు మాత్రం నాయనమ్మని అనేదానివి కదూ! నా కిప్పటికీ గుర్తే!"

"ఇవిగో నీళ్లు! మందు వేసుకో!"

** ** **

"ఎంత వయసు వచ్చినా ఇంకా కొడుకుతో చాడీలు చెపుతోంది, చూడవే సీతాలూ! అందుకే ఆమె అంటే నాకు అసహ్యం!"

"పోనీలెండమ్మా! ముసిల్ది! బతికినన్నాళ్లు బతుకుద్దా? పాపం!"

"చాల్లే! ఇంకా బతకాలా! ఇప్పటికే నా ఆయుష్షు మట్టమయిపోతోంది. నేనయితే ఇలా బతికి అందరినీ కాల్చుకు తిననమ్మా! ఏ నుయ్యో, గొయ్యో చూసుకునో, మందో - మాకో మింగి ఛస్తాను!"

** ** **

"లక్ష్మీ! ఈ రోజు సినిమాకు టిక్కెట్లు తెచ్చాను. త్వరగా తయారవ్వు!" అన్నాను.

"ఇదిగో! అన్నం ఇక్కడ పెట్టాను, తినండి! మేము సినిమాకు పోతున్నాం. వచ్చేసరికి ఆలస్యమవుతుంది. మేము బయట తాళం వేసుకుపోతున్నాం!"

** ** **

వాసు, లక్ష్మి మాటలు జానకమ్మ మెదడు మీద బాగా పనిచేస్తున్నాయి. గతమంతా సినిమా రీళ్లులాగా తిరగటం మొదలుపెట్టింది.

"వాసు చెప్పింది నిజమే! నేను కూడా నా అత్తగారిని ఇలాగే వేధించేదాన్ని. ఆయన కూడా వాళ్లమ్మని ఇలాగే అన్నారు - 'నువ్వు నాయనమ్మని అనటంలేదూ!' అని. ఆ వయసు ప్రభావం అటువంటిది. నాకు కూడా అదే దుర్గతి పట్టింది. ఇది అత్తగారి శాపం కాబోలు! నా కీ శాస్తి జరగవలసిందే! ఎవరు చేసిన కర్మ వా రనుభవించక తప్పదు అన్నట్లుగా, లక్ష్మి అన్న మాటల్లో తప్పు లేదు. నేను కూడా మా అత్తగారితో 'నే నయితే మీలాగా కాదు ...' అంటూ ప్రగల్భాలు పలికినదాన్నే!" - మనసు పరిపరి విధాల ఆలోచనలతో నిండిపోయింది. సమస్య, పరిష్కారాలతో మనసు కొట్టుమిట్టాడింది. చివరికి ఒక నిర్ణయానికి వచ్చి నెమ్మదిగా దేక్కుంటూ రాము పుస్తకంలో కాగితం, పెన్ను తీసుకున్నారు జానకమ్మగారు.

** ** **

"ఇంకా ముసిల్ది లేవలేదు! మళ్లీ కాఫీ చల్లారిపోయింది అంటుంది" అనుకుంటూ కాఫీ గ్లాసుతో జానకమ్మ గదిలోకి ప్రవేశించింది లక్ష్మి.

జానకమ్మ గది అంతా అల్లకల్లోలంగా ఉంది. ఎక్కడ పెట్టిన తిండి అక్కడే ఉంది. మందులు చింపిన కాగితాలతో నిండి ఉంది. జానకమ్మను తట్టి లేపబోయింది. శరీరం హిమాలయంలా ఉంది.

"ఏమండీ!" అన్న భయంకరమైన పిలుపుతో వాసు వెళ్లి చూశాడు. ఏముందీ, అంతా అయిపోయింది! పరిస్థితి అర్థమైన నేను చేష్టలుడిగి అమ్మను చూస్తున్నాను. ఆమె చేతిలో కాగితం గట్టిగా బిగుసుకుని ఉంది. అది నాకు అమ్మ రాసిన ఆఖరి ఉత్తరం.

** ** **

"చి|| వాసుకి,

"మీ అమ్మ పుత్ర పౌత్రాభివృద్ధిగా ఆశీర్వదించి రాయునది. నాయనా, వాసూ! నీవు కథలు రాస్తావట కదూ! నేను నీతో ముఖాముఖి మాట్లాడలేక నా జీవిత సత్యాలను కాగితాల మీద పెడుతున్నానురా! నా ఈ కథను పూర్తిగా చదివి, నా జీవితాన్ని నాకు 'తగిన శాస్తి'ని పదిమందికీ పత్రికల్లో చాటి చెప్పరా నాయనా! అప్పుడు కాని నా ఆత్మ శాంతించదు. నేను రాసింది పూర్తిగా చదువు. మీరు ఉభయులు నాకు సేవ చేసినందుకు చాలా సంతోషం. నేను దెప్పుతున్నా ననుకోవద్దురా!

"నేను మాత్రం నా అత్తగారి పట్ల ఎలా ప్రవర్తించానో తల్చుకుంటే మీకు నా ముఖం చూపించబుద్ధి కావటంలేదురా! నేనే కాదు మా అత్తగారు కూడా వాళ్ల అత్తగారితో ఇలాగే ప్రవర్తించిందిరా! ఇది అనాది నుండి వచ్చిన ఆచారంలా అంటువ్యాధి అయిపోయిందిరా వాసూ!

లక్ష్మి అలా ప్రవర్తించటంలో ఆమె తప్పు అణుమాత్రం లేదు. ఆ వయసు ప్రభావం అటువంటిది. నాయనా! కోడలు లక్ష్మిని ఏమీ అనకురా! అన్నావంటే నాకు ప్రాయశ్చిత్తం అవదు. నాకు తగిన శాస్తి జరిగింది. నేను తవ్వుకున్న గోతిలో నేనే పడ్డాను. మీరు సినిమాకు వెళ్లిన తర్వాత గత జీవితాన్ని తల్చుకుంటే సిగ్గనిపించింది.

"ఒక నిర్ణయానికి వచ్చి, నా జీవితాన్ని ఇక చాలించుకుంటున్నాను. దీనికి ఎవరూ బాధ్యులు కారు. ఏ పరిస్థితుల్లోనూ లక్ష్మిని ఏమీ అని బాధించకురా! నా మాట వింటావు కదూ! ఎండిపోయిన ఆకు ఎప్పటికైనా రాలిపోవలసిందే కదా! నా నిర్ణయం నీకు కష్టం కలిగిస్తే మన్నించు. నా చావుకు కారణం ముందు తరాలవారికి జ్ఞానోదయం కలిగించాలని ఆశిస్తూ శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను!

"ఇట్లు

"మీ అమ్మ

"జానకమ్మ."

ఉత్తరం చదివిన నేను లక్ష్మిని తిట్టలేక, నా అజ్ఞానానికి చింతిస్తూ నన్ను నేను తిట్టుకున్నాను.

విషయం తెలిసిన లక్ష్మి బోరుబోరున ఏడ్చింది "అత్తయ్యా! నన్ను క్షమించండి!" అంటూ.

"పోస్ట్!" అన్న పిలుపుతో వర్తమానంలోకి వచ్చాను. వార పత్రికలో నేను రాసిన మా అమ్మ కథ - 'తగిన శాస్తి' అచ్చయింది. అది చదివిన కొందరికైనా జ్ఞానోదయ మవుతుందనే తృప్తితో ఫోటో ఫ్రేములోని అమ్మని చూశాను. ఆమె నిశ్చింతగా నవ్వుతోంది.